క్లుప్తంగా

గుర్రాల పోటీల స్థలం పరిశీలన



గుర్రాల పోటీలు నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం : మండల కేంద్రంలో మంగళవారం నల్లకొండమ్మతల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పోటీలు నిర్వహించే స్థలాన్ని నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. నాతవరం గ్రామస్తుల ఆరాధ్య దైవం నల్లకొండమ్మ తల్లి పండగను ఏటా అక్టోబర్‌లో నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. పండగ సందర్భంగా గుర్రాల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆయా పోటీలు జరిగే స్థలాన్ని ఎస్ఐ పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు.

పంటల నమోదుకు 25 వరకు గడువు

దేవరాపల్లి : పంటల నమోదుకు ఈ నెల 25 వరకు మాత్రమే గడువు ఉందని, ఈలోగా ప్రతి రైతు పంటల నమోదు ప్రక్రియను చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ సూచించారు. మారేపల్లిలో పంటల నమోదు ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. రైతుకు ఉన్న ప్రతీ సర్వే నంబర్‌లోను సాగు చేసిన పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ రామాంజలికి సూచించారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో కొత్త పాస్‌బుక్‌లు మంజూరవ్వడంతో ఈ ఏడాది 12,700 వరకు రైతులు ఉంటారని, వారంతా గడువులోగా పంటల నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

జిఎస్టీ 2.0 పై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈవో జగ్గారావు, హెచ్ఎం శేషగిరిరావు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఎస్టీ 2.0పై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలో గల ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు స్థానిక కేజీబీవీ విద్యార్థులు కూడా ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలకు ఎంఈవోలు 1,2 జానుప్రసాద్, జగ్గా రావు, హెచ్ఎం శేషగిరిరావు బహుమతులు అందజేశారు.

176 మందికి ఉచిత కంటి పరీక్షలు

కె.కోటపాడు : కె.కోటపాడు రామాలయం వద్ద సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 176 మందికి పూజిత ఐ క్లినిక్, శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి ఉచితం మందులు అందించారు. 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి చికిత్సకు తరలించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, సమితి సేవాదళ్ కోలా శ్రీను, గోపీ కృష్ణ, గోపీ వెంకటరావు, గజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విమ్స్ ఆధ్వర్యంలో నాణ్యమైన సరకులు పంపిణీ

రోలుగుంట : గ్రామాల్లో సమగ్ర మహిళా(విమ్స్) సంఘాల ఆధ్వర్యంలో నగదు చెల్లింపు వాయిదా పద్ధతిలో నాణ్యమైన సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం కొమరవోలు గ్రామంలో వాహనంలో నాణ్యమైన నిత్యావసర సరకులను తరలించి గ్రామస్తులకు పంపిణీ చేశారు. దీనికి ముందు కార్యక్రమం ఉద్దేశ్యం గురించి మండల ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. మహిళల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఈ సంఘాలు పని చేస్తాయన్నారు. సరుకుల పంపిణీ తాత్కాలిక సహాయం మాత్రమేనని, దశల వారీగా నిరుద్యోగ మహిళలకు స్కిల్ ట్రైనింగ్ కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

రావికమతం : మండలంలోని కొత్తకోట పీఏసీఎస్ పరిధిలో మృతి చెందిన సొసైటీ సభ్య రైతుల కుటుంబాలకు బీమా చెక్కులను సొసైటీ చైర్పర్సన్ పి.వి.ఎస్.ఎన్.రాజు సోమవారం పంపిణీ చేశారు. సొసైటీ సభ్య రైతులు గొలగాని అప్పలనాయుడు, సోమిరెడ్డి రాజు, గోకాడ దేముడు ఇటీవల మృతి చెందారు. ఈ ముగ్గురికి బీమా సాయంగా రూ.30 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. గొలగాని అప్పలనాయుడు ప్రమాదవశాత్తూ మరణించడంతో అతడికి ప్రమాద బీమా కింద అదనంగా రూ.2 లక్షలు ఇవ్వనున్నారు. సొసైటీ సీఈవో రఘు, సిబ్బంది కోట రమణ, రాజారావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రావికమతం : జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందని రావికమతం ఎంపీడీవో మహేష్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై రావికమతంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.



అమ్మకానికి తీసుకువస్తున్న టమాటా పంట



కె.సంతపాలెంలో సాగులో ఉన్న టమాటా పంట



సాగులో ఉన్న కాలీ ఫ్లవర్ పంట

దిగుబడి ఘనం.. గిట్టుబాటు గగనం

- కూరగాయల రైతుల అవస్థలు
- మండలంలో 500 ఎకరాల్లో కూరగాయల సాగు
- నిల్వ చేసుకునే సదుపాయం లేక
- తక్కువ ధరలకే రైతుల అమ్మకాలు
- కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని వేడుకోలు

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును చేపడుతున్నారు. పండించిన కూరగాయలు స్థానికంగా కె.సంతపాలెం రైతు బజార్‌లో అమ్మకాలు జరుపుతారు. కె.సంతపాలెం, కె.కె.అగ్రహారం, చంద్రయ్యపేట, సూదివలస, పాతవలస, దాలివలస, ఆర్లి, బొట్టవానిపాలెం, కింతాడ, గవరపాలెం, పిండ్రంగి, కె.జె.పురం గ్రామాల్లో రైతులు సుమారు 500 ఎకరాలలో కూరగాయలు సాగు చేస్తున్నారు.

దిగుబడి ఘనం..గిట్టుబాటు శూన్యం..

రైతులు పండించే పంటను కొనుగోలు చేసేందుకు విశాఖపట్నం, గాజువాక, కొత్తవలస, అనకాపల్లి ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు ప్రతి రోజూ వస్తుంటారు. రైతులు పెద్ద సంఖ్యలో ఒకే రకమైన పంటను అమ్మకాలు చేసేందుకు తీసుకువచ్చిన సమయంలో మద్దతు ధర మాత్రం అంతంత మాత్రంగానే దక్కుతుంది. కూరగాయలకు బయట **మార్కెట్‌లో మంచి ధర ఉన్నా ఇక్కడి రైతుకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. పండించిన పంటను నిల్వ చేసి మరునటి రోజు అమ్మకాలు చేసే పరిస్థితి లేక పోవడంతో కొనుగోలుదారులు అడిగిన ధరలకే రైతులు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని** వాపోతున్నారు.

కోల్డ్ స్టోరేజి ఏర్పాటు కోసం రైతుల వినతి

మండలంలో కె.సంతపాలెం రైతు బజార్ సమీపంలో ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజీని ఏర్పాటు చేయాలని రైతులు కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ప్రాంతంలో గల ప్రజలు ప్రధానంగా సాగు చేస్తున్న కూరగాయల పంటల వివరాలను గుర్తించి, పంటకు మంచి మద్దతు ధర వచ్చే వరకూ నిల్వ చేసుకునేలా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రతి రోజూ ఈ రైతు బజార్ ద్వారా సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ కూరగాయల అమ్మకాలు జరుగుతాయి.



దాలివలసలో టమాటాలను సేకరిస్తున్న సాగు రైతులు

కోల్డ్‌స్టోరేజీతో రైతులకు మేలు



కె.సంతపాలెం రైతు బజార్ వద్ద కోల్డ్‌స్టోరేజీని ఏర్పాటు చేయాలి. రైతులు రైతు బజార్‌కు తీసుకువచ్చే పంటలను తప్పనిసరిగా అమ్మకం చేయాల్సిందే. పంటకు గిట్టుబాటు ధర లేనప్పుడు నిల్వ చేసేందుకు ఇక్కడ ఎటువంటి సదుపాయం లేదు. దీంతో సాగు ఖర్చులు ఎక్కువ అవుతున్నా తప్పని పరిస్థితిలో తక్కువ ధరకే పంట అమ్ముకోవాల్సి వస్తోంది. కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తే ధర లేనప్పుడు పంట నిల్వ చేసుకుని మంచి ధరలకు విక్రయించే సదుపాయం కలుగుతుంది.

– ఆదిరెడ్డి రామునాయుడు, రైతు, దాలివలస

రైతులు సంప్రదిస్తే సదుపాయం కల్పిస్తాం..



కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు ఆసక్తి గల రైతులు ముందుకు వస్తే వారికి 35 శాతం రాయితీపై శీతల గదిని అందించనున్నాం. దీంట్లో పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. భూమి గల రైతులు ఉద్యానవన అధికారులను సంప్రదిస్తే మంజూరు చేస్తాం.

– ఆర్.కిర్మణ్మయి, ఉద్యానవనశాఖాధికారి, కె.కోటపాడు

శతశాతం సాగునీటి పన్నులు వసూలు చేయండి

బుచ్చెయ్యపేట : గ్రామాల్లో శతశాతం నీటి పన్నును వీఆర్వోలు వసూలు చేయాలని తహసీల్దార్ లక్ష్మి కోరారు. సోమవారం మండల కేంద్రం బుచ్చెయ్యపేటలో తన కార్యాలయంలో జరిగిన వీఆర్వోల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వడ్డాది, విజయరామరాజుపేట,చిన అప్పనపాలెం,పోలేపల్లి తదితర గ్రామాల్లో సాగునీటి పన్ను బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఆయా గ్రామాల రైతులతో సాగునీటి పన్నులు కట్టించాలని, గ్రామ రెవిన్యూ పరిధిలో వస్తున్న ప్రజా ఫిర్యాదులు వెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఆమె వీఆర్వోలను కోరారు. కార్యక్రమంలో వీఆర్వో సంఘ నాయకులు సుధాకర్,రమణ పాల్గొన్నారు.

కించుమండకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కించుమండ గిరిజనులు

దేవరాపల్లి : గరిశింగి పంచాయతీ శివారు కించుమండకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొరతో కలిసి బాధిత గిరిజనులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. రోడ్డు కోసం ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక తమ పిల్లలను బంధువుల ఇళ్ల వద్ద ఉంచి చదివించుకోవాల్సి వస్తోందని, అలాగే గ్రామంలో ఎవరికి అనారోగ్యం వచ్చినా డోలీ కట్టి దించాల్సిన పరిస్థితి ఉందన్నారు. పది కుటుంబాలు ఉన్న ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా గిరిజనుల కష్టాలను అర్థం చేసుకొని తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు, సీపీఎం నేతలు వెంకన్న, బి.టి.దొర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరుకు రాజు, కంచర గంగరాజు, కంచరి శ్రీను, గంగరాజు, కాగల దేముడు, రాంకుమార్ తదితర గిరిజనులు పాల్గొన్నారు.

కొత్తకోట పీహెచ్‌సీ, మేడివాడ అంగన్‌వాడీలకు స్వచ్ఛత అవార్డులు



అవార్డు అందుకుంటున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ, వైద్య సిబ్బంది

రావికమతం: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థలకు సోమవారం అనకాపల్లిలో జిల్లా స్థాయి అవార్డులు అందించారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మేడివాడ-1 అంగన్‌వాడీ కేంద్రాలకు పురస్కారాలు లభించాయి. కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ, ఆరోగ్య సిబ్బంది, మేడివాడ-1 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త దాడి జగ్గారావు కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి అవార్డు అందుకున్నారు.

వారం రోజుల్లో చెత్త కుప్పలు ఖాళీ చేయిస్తాం

రావికమతం : రావికమతం ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న చెత్త కుప్పలను వారం రోజుల్లో అక్కడి నుంచి ఖాళీ చేయిస్తామని ఎంపీడీవో మహేష్ చెప్పారు. ఇక్కడ ఎస్సీ కాలనీని ఆనుకొని డంపింగ్ యార్డును తలపించేలా చెత్త కుప్పలు ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా అధికారి స్పందించి ఎస్సీ కాలనీకి ఆనుకొని చెత్తను గుట్టలుగా వేయడంపై ఆరా తీశారు. వెంటనే చెత్త కుప్పలను అక్కడి నుంచి వేరే చోటకి తరలించాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి చెత్త వేస్తున్న ప్రదేశాన్ని సోమ వారం పరిశీలించారు. వారం రోజుల్లో ఖాళీ చేయించాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్‌ను ఎంపీడీవో మహేష్ ఆదేశించారు.

వీఆర్ఏల ధర్నాను విజయవంతం చేయండి

బుచ్చెయ్యపేట : దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి విజయవాడలో చేపట్టిన ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని మండల వీఆర్ఏ (గ్రామ తలయారీ)ల సంఘం అధ్యక్షుడు శ్రీను పిలుపు నిచ్చారు. సోమవారం బుచ్చెయ్యపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలీచాలనీ జీతాలతో అవస్థలు పడుతున్న వీఆర్ఏలకు న్యాయం చేయాలని ఈ నెల 13 నుండి 15వ తేదీ వరకు మూడు రోజులు పాటు విజయవాడలో ధర్నా చేస్తున్నామన్నారు. వీఆర్ఏలకు రాత్రిపూట డ్యూటీలు రద్దు చేయాలని, డీఏని జీతంలో కలిపి ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని, అర్హత కలిగిన వారికి వీఆర్వో, అటెండర్, వాచ్‌మన్, రికార్డింగ్ అసిస్టెంట్ పోస్టుల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ 13,14 తేదీల్లో రిలే దీక్షలు, 15న మహా ధర్నా చేపట్టామన్నారు. అన్ని గ్రామాల వీఆర్ఏలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏ సంఘ నాయకులు బండి శ్రీరామూర్తి, రామారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఫిర్యాదులు నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలి

నర్సీపట్నం : పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రోలుగుంట మండలం, భోగాపురానికి చెందిన ఎం.సత్యనారాయణ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కోటా డీలర్ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ పాయకరావుపేట మండలం, పెంటకోటకు చెందిన ఎ.శివకృష్ణ, తన భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టంకు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

చెందిన ఆళ్ల ప్రసాద్, సాగులో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన ఎ.వీర్రాజు అర్జీలు అందించారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధంపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం : రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా నిలిచిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును గృహ నిర్బంధం చేయడం పోలీసులకు తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పోలీసు నిర్బంధంతో ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. తక్షణమే అప్పలరాజుపై నిర్బంధాన్ని తొలగించాలన్నారు. సీపీఎం నాయకులు చిరంజీవి, సాంబా పాల్గొన్నారు.

దేవరాపల్లి : సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును పెట్టొద్దని మత్స్యకారులు చేపడుతున్న ఆందోళనకు అండగా నిలిచిన అప్పలరాజును గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

దేవరాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అంబేడ్కర్ యూత్ సంఘం, మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. దేవరాపల్లిలో సంఘ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, దేవళంపేటలో గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చడం అమానుషమైన చర్యగా పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి..



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

నర్సీపట్నం : విద్య, వైద్యం, వ్యవసాయాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా వ్యాపారమయం చేసిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీని మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న సందర్శిస్తున్నారన్నారు. జీవో లేదు.. ఉత్తుత్తి కాలేజీ అని మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వంటి నాయకుల కళ్లు తెరిపించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్నారన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలతో పాటు పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో 7 కాలేజీలను పూర్తి చేశామన్నారు. అసంపూర్తిగా ఉన్న కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉచిత వైద్యం ప్రజలకు అందే అవకాశం లేదన్నారు. ప్రజలకు జరుగుతున్న నష్టంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో 600 పడకలతో మెడికల్ కాలేజీని జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని, ఈ కాలేజీ ఆగితే ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కూరుపాం ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన సంఘటనలో ప్రాణాపాయస్థితిలో ఉన్న విద్యార్థులను విశాఖ కేజీహెచ్‌కు తరలించాల్సి వచ్చిందన్నారు. అదే మెడికల్ కాలేజీ పూర్తి చేసి ఉంటే పిల్లలకు సత్వర వైద్య సేవలు అందేవన్నారు.

అధినేతకు ఘన స్వాగతం పలకాలి

ఈ నెల 9న మెడికల్ కాలేజీ సందర్శనకు విచ్చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని అమర్‌నాథ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, వివిధ విభాగాల నాయకులతో మాజీ ఎమ్మెల్యే గణేష్ సమావేశం ఏర్పాటు చేశారు. కాలేజీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంతీయులపై ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్లమెంట్ పరిశీలకులు శోభా హైమావతి, సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రీసర్వే

నాతవరం : మండలంలో రెండు రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే చేస్తున్నామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. ఆయన సోమవారం భూ రీసర్వే చేస్తున్న సర్వేయర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజుపేట అగ్రహారం రెవెన్యూ గ్రామంలో మొత్తం 93 సర్వే నంబర్లు ఉండగా మొత్తం భూ విస్తీర్ణం 583 ఎకరాలు 32 సెంట్లు ఉందన్నారు. తర్వాత కొండ ధర్మవరం రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్లు మొత్తం 125 ఉండగా, భూమి విస్తీర్ణం 897 ఎకరాల 15 సెంట్లు ఉందన్నారు. కొండ ధర్మవరం రెవెన్యూ గ్రామంలో అధికంగా రైతులు బయట వ్యక్తులు ఉన్నారన్నారు. ఈ విషయాన్ని నర్సీపట్నం ఆర్డీవో దృష్టిలో పెట్టి రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, సచివాలయ సర్వేయరు విజయకుమార్, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫారం వేయాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట : మూడు నెలలుగా చీకట్లో మగ్గుతున్న బాధిత గిరిజన గ్రామాల ప్రజలు సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. రెమ్మలి అప్పారావు, వంతల చిన్న, గమ్మిడి చిలుకమ్మ మాట్లాడుతూ రోలుగుంట మండలం అర్ల పంచాయతీ నీళ్లబంద, రావికమతం మండలం సోంపురం బంద గ్రామాల్లో కొందు గిరిజనులు 40 మంది జనాభా ఉన్నారని తెలిపారు. తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆందోళన చేయగా స్పందించిన అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారని, అయితే పాత ట్రాన్స్‌ఫారం వేయడంతో అది కాలిపోయిందన్నారు. మూడు నెలలైనా అధికారులు సమస్య పరిష్కరించలేదని, వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీ సందర్శనను విజయవంతం చేయండి

రావికమతం: నర్సీపట్నం వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా.మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు, మండల పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, ప్రొటోకాల్ జెడ్పీటీసీ తలారి ఆదిమూర్తి, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, ముత్సా భవానీ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ఆసరి వాసుగోవిందరావు, మాజీ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు గుమ్మడు సత్యదేవ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్



మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

పూడి దేవ కోరారు. నిర్మాణ పనులను 9వ తేదీన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించనున్నారని వారు చెప్పారు. మండలంలో గల వైఎస్సార్‌సీపీకి సంబంధించిన సర్పంచ్, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

కె.కోటపాడు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల్య దశల్లోనే చిన్నారులకు క్రమ శిక్షణతో కూడిన విద్యతో పాటు మంచి ఆరోగ్యం అందుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కె.కోటపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లులపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను తీసుకువచ్చే బాధ్యతను గుర్తించాలన్నారు. రాష్ట్రీయ పోషణ మాసం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలిత కుమారి ప్రజాప్రతినిధులు, అధికారులతో చేయించారు.

'సమస్యలు పరిష్కరించని పీజీఆర్ఎస్'

దేవరాపల్లి: ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందించే దరఖాస్తులకు పరిష్కార మార్గం చూపించకుండానే ముగిస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అన్నారు. దేవరాపల్లి నుంచి కొత్తవలస వెళ్లే మార్గంలో కృష్ణారాయుడిపేట సమీపంలో శిథిలమైన కల్వర్టును వరదపురెడ్డి లలితానాయుడు, గంగవంశం సంతోష్, చొక్కాకుల రమణ, కొరుపోలు శ్రీను తదితరులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు శిథిలం కావడంతో ఈ మార్గం గుండా దేవరాపల్లికి బస్సుల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. కల్వర్టు శిథిలమై మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై గత నెల 29న గంగవంశం సంతోష్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా, కె.కోటపాడు ఆర్అండ్‌బీ ఏఈ స్పందించి ఇది జీవీఎంసీ పరిధిలోనిదని, రూ.91 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు రావడం లేదని తెలిపారని రమణ పేర్కొన్నారు. ప్రభుత్వమే ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు.



శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న కె.వి.రమణ, లలితానాయుడు తదితరులు